క్లుప్తంగా

సాగరిక ఫర్నిచర్ షాప్ ప్రారంభం



గోదావరిఖని: స్థానిక మార్కండేయకాలనీలో శనివారం నూతన ఫర్నిచర్ షాపింగ్ మాల్‌ను ప్రముఖ సెల్లో కంపెనీ జోనల్ మేనేజర్ సంతోష్‌మిశ్రా శనివారం ప్రారంభించారు. కార్పొరేటర్ మంచికట్ల దయాకర్, సాగరిక గ్రూప్ చైర్మన్ తిరుపతి, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్, దయానంద్‌గాంధీ, సురభి శ్రీధర్, ఆడెపు శ్రీనివాస్, అశోక్‌రావు, శివ పాల్గొన్నారు.

అక్రమంగా డబ్బు తరలిస్తే చర్యలు



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

ఓదెల: అక్రమంగా డబ్బులు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా సరిహద్దు ఓదెల మండలం గుంపుల గ్రామ శివారులో చెక్‌పోస్టును సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధలు పాటించాలన్నారు. ఆధారాలు లేకుండా నగదు, బంగారు ఆభరణాలు తీసుకెళ్లరాదన్నారు. చెక్‌పోస్టు వద్ద నిత్యం వాహనాలను తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. చెక్‌పోస్టు వద్ద పోలీసులకు వాహనాల తనిఖీకి సహకరించాలన్నారు. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఉన్నారు.

డాక్టరేట్ అందుకున్న నాగండ్ల రవికుమార్



డాక్టరేట్ అందుకుంటున్న రవికుమార్

గోదావరిఖనిటౌన్: విద్యారంగం, సేవ, ఆధ్యాత్మిక రంగాల్లో చేస్తున్న సేవలను గుర్తించి సోషల్ సర్వీస్‌లో భాగంగా స్థానిక కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల నిర్వాహకుడు నాగండ్ల రవికుమార్‌కు హెచ్‌ఎస్‌సీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ బిషప్ ఆనంద్, డాక్టర్ మమత, డాక్టర్ అబ్రహం, డాక్టర్ పసుల రామ్మూర్తి చేతుల మీదుగా హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

ధర్మారం: మండలంలోని బంజేరుపల్లి తండా గ్రామానికి చెందిన బుక్య సంతోష్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతిని మంచానికే పరిమితమయ్యాడు. దీంతో ధర్మారం ఎంపీటీసీ తుమ్మల రాంబాబు సంతోష్‌నాయక్‌కు వీల్‌చైర్ అందజేశారు. అజ్మీర మల్లేశ్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, దేవి అజయ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

మంథని: మంథనిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులతో పాటు ఇతర వస్తువులను సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటకృష్ణ అందజేశారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలని, పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, దొమ్మటి రవి, మహేందర్, ఉమా సుందరి ఉన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం కూడా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శ్రమదానం చేశారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. అనంతరం చెత్త, చెదారాన్ని తొలగించారు. ప్రిన్సిపాల్ రవీందర్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ సమద్, అధ్యాపకులు సదానందం, ఆమని పాల్గొన్నారు.

బొడ్రాయి ఉత్సవాలకు భూమిపూజ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో ఈ నెల 30 నుంచి నిర్వహించే భూలక్ష్మి శ్రీలక్ష్మి సహిత(బొడ్రాయి) కొలుపు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించడానికి శనివారం గ్రామస్తులు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.

కొమురన్న జాతరకు 64ఏళ్లు

- నేటికీ దేవాలయంలో నిత్య పూజలు
- రెండురోజులు జాతర నిర్వహించనున్న యాదవులు



మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులు

రామగుండం: తన మరణాన్ని ముందుగా కుటుంబసభ్యులకు తెలపడం, అదేవిధంగా ఇతరుల జీవితాలపై భవిష్యవాణిని వినిపించిన గోపు కొమురయ్యను అతని మరణానంతరం గ్రామప్రజలు దైవస్వరూపంగా భావించడంతోపాటు యాదవులు తమ ఆరాధ్య దైవంగా భావిస్తూ ఆయన పేరుతో జాతర నిర్వహిస్తున్నారు. అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామానికి చెందిన గోపు కొమురయ్య శక్తిగా మారడంతో ఆయన మరణానంతరం ఆయన పేరుతోనే 64ఏళ్లుగా గోపు వంశీయులు జాతర నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

భవిష్యవాణితోనే బహుళ ప్రాచుర్యం..

ఆరు దశాబ్దాల క్రితం గోపు కొమురయ్య భవిష్యవాణి చెప్పేవారు. సమాజంలో జరిగే శుభాలు, దుష్పరిణామాలు ముందుగా గ్రహించి చెప్పేవారు. ఆయనకు పూనకం వచ్చిన సమయంలో జరగబోయే విషయాలను చెప్తుండేవారు. తన మరణం ఎప్పుడు సంభవిస్తుందో అనే విషయాలతో పాటు మరణానంతరం తన పేరుతో జాతర నిర్వహించాలని ముందుగానే గోపు వంశీయులకు సూచించారు. తాను పేర్కొన్న సమయానికే శివైక్యం పొందడంతో ఆయననను మహా పురుషుడిగా భావించి సమాధిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పెరిగిపోయారు. ప్రతీరోజు ఉదయం క్రమం తప్పకుండా అతడి సమాధి వద్ద గోపు వంశీయులు దీపారాధన చేస్తారు. మల్లికార్జునస్వామి కల్యాణం పేరిట 64ఏళ్లుగా జాతర నిర్వహిస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి సైతం అధిక సంఖ్యలో యాదవ కులస్తులు వస్తారు. హోళి పండుగకు ముందు జాతర నిర్వహిస్తుంటారు.

17, 18వ తేదీల్లో జాతర..

అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శివారు హైదరాబాద్ మెట్రో పంపుహౌస్ ప్రాంగణంలో ఉన్న ఆయన సమాధి (దేవాలయం) వద్ద 17, 18వ తేదీల్లో జాతర వేడుకలను కొమురన్న వారసుడు జాతర కార్యనిర్వాహక ప్రతినిధి గోపు అయిలయ్యయాదవ్ నిర్వహిస్తారు. తొలిరోజు దృష్టి కుంభం, మైలలు తీయుట, రుద్రాభిషేకం, బియ్యం, సుంకు పెద్దపట్నంతో పాటు ఉదయం 11.45 గంటలకు శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహిస్తారు. 18న ఉదయం 4గంటలకు అగ్నిగుండ ప్రవేశం అనంతరం ఇప్పలపల్లి భరత్‌స్వామి జంగమ మహేశ్వరులతో ఒగ్గు కళా బృందం స్వర్గీయ గోపు కొమురన్న జీవిత చరిత్ర, జాతర ఆవిర్భావం, నిర్వహణ ప్రాధాన్యతపై ఒగ్గుకథ ప్రదర్శిస్తారు. భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తారు. కొమురన్న జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపించనుంది.

భక్తుల్లో నమ్మకం పెరిగింది



నా తండ్రి స్వర్గీయ గోపు కొమురయ్య జ్ఞాపకార్థం నిర్వహించే జాతర భక్తులకు కొంగుబంగారంగా మారింది. మనసులో కోరుకునే కోరికలను తీర్చాలంటూ కొమురన్న దేవుడిని తలుచుకుంటే అప్పటికే పరిష్కార మార్గం రావడంతో భక్తుల్లో నమ్మకం పెరిగింది. 64 ఏళ్లుగా దీపం ఆరకుండా మా వంశీయులు దీపారాధన చేస్తుండడంతో.. ఆయన మా మధ్య లేకపోయినా జీవించి ఉన్నట్లుగానే భావిస్తున్నాం.

– గోపు అయిలయ్యయాదవ్, జాతర కార్యనిర్వాహక ప్రతినిధి

సుందర పెద్దపల్లిగా తీర్చిదిద్దుకుందాం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంగా ఉన్న పెద్దపల్లిని సుందరంగా తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలోని చీకురాయి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం రూ.2కోట్ల నిధులతో చేపట్టిన డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను సుందరీకరించే పనులు చేపట్టామని, రెండు సర్కిళ్లలో పూర్తయ్యాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, రాగినేడులో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలో గ్రంథాలయాన్ని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ప్రారంభించారు. జెడ్పీటీసీ రామ్మూర్తితో పాటు కౌన్సిలర్లు, నాయకులున్నారు.

ఓదెలలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఓదెల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దళారులకు డబ్బులివ్వొద్దని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ఇళ్ల మంజూరు కోసం, బిల్లుల మంజూరుకు లంచం డబ్బులు ఎవరికైనా ఇస్తే వెంటనే తనకు తెలుస్తుందని, వెంటనే రద్దుచేస్తానని పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ ఇంటింటా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తామన్నారు. ఓదెల ఎంపీడీవో తిరుపతి, తహసీల్దార్ యాకన్న, నాయకులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రినిటిలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



నియామక పత్రం అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు ఫైనలియర్ వారికి ఇందులో అవకాశం కల్పించారు. గూగుల్ క్లయింట్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ తదితర కంపెనీలు పాల్గొన్నాయి. 69 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. నియామకపత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అందజేశారు. ప్రిన్సిపాల్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ సీతూరెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పవిత్ర భవాని, శివ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దపల్లిరూరల్: మండలంలోని అప్పన్నపేట, బ్రాహ్మణపల్లి, బొంపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం బసంత్‌నగర్ ఎస్సై స్వామి పరిశీలించారు. లోకసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతవాతరణంలో జరిగేలా సహకరించాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చన్నారు.

కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న రూ.కోటి 20 లక్షల మంది కార్మికులకు వర్తించే జీవోలను డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జీవోలు జారీ చేసినప్పటికీ వేతనాలు పెరగలేదన్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు, రైస్‌మిల్ వర్కర్స్, బసంతనగర్ తదితర పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచేలా జీవో ఇవ్వాలన్నారు. నాయకులు భూపాల్, ఎరవెల్లి ముత్యంరావు, ఎస్.బిక్షపతి, మెండె శ్రీనివాస్, అరవింద్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీ టికెట్ గజ్జెల కాంతంకు ఇవ్వాలి

కమాన్‌పూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ టికెట్ గజ్జెల కాంతంకు ఇవ్వాలని రాష్ట్ర మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందరసన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించిన గజ్జెల కాంతంకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు. కుక్క చంద్రమౌళి, బత్తుల శంకర్, తోకల మల్లేశ్, మంథని కరుణకృష్ణ, ఇరుగురాల సంతోష్, చొప్పదండి రాజు, బొంకూరి పోషం, ఆవునూరి రాయలింగు, చిప్పకుర్తి నర్సయ్య పాల్గొన్నారు.

బీసీ మహిళను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నియమించాలి

మంథని: మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీసీ మహిళను ప్రకటించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు తరగం శంకర్‌లాల్ కోరారు. శనివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళలకు చైర్మన్, ఎస్సీ సామాజిక వర్గానికి వైస్‌చైర్మన్ ఇచ్చి బీసీలపై ఉన్న ప్రేమను చాటుకోవాలన్నారు. కాయిత సమ్మయ్య, వేల్పుల గట్టయ్య మంథని లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యనారాయణ ఉన్నారు.

వికల్ప పోటీల్లో ప్రతిభ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీకాలేజీ బీకాం విద్యార్థులు శాతవాహన యూనివర్సిటీ కామర్స్ విభాగం వారు నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి వికల్ప పోటీల్లో ప్రతిభ కనబర్చారు. రంగోలి కార్యక్రమంలో బీకాం ఫస్టియర్ విద్యార్థిని రిబికా, దీప్తి ద్వితీయ బహుమతి సాధించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ కోఆర్డినేటర్ సంజీవ్, అధ్యాపకులు రామకృష్ణ, రవీందర్‌రావు, అర్జున్, శ్రీనివాస్ అభినందించారు.

సంక్షిప్త వార్తలు

పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగ సామాజిక వర్గానికే కేటాయించాలి

మంథని: పెద్దపల్లి ఎంపీ స్థానం వలస నాయకులకే కాకుండా పార్లమెంట్ పరిధిలోని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వాసర్ల నతానియేలు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. రామగిరి కుమార్, చిలుముల మహేంద్రకుమార్, వాసాల జాన్, రామగిరి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవ కమిటీ ఎన్నిక

జూలపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించే గుంటి వారి శ్రీరేణుకా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ గుంటి ఐలయ్య, వైస్ చైర్మన్‌గా గుంటి శంకర్, క్యాషియర్‌గా రాజమల్లు, కార్యవర్గ సభ్యులుగా గుంటి అశోక్, వీరేశంను ఎన్నుకున్నారు. పెద్ద మనుషులుగా గుంటి పోచాలు, గుంటి ఐలయ్య వ్యవహరిస్తారు.

మాల మహానాడు కార్యాలయం ప్రారంభం

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ఎల్‌బీనగర్‌లో మాల మహానాడు కార్యాలయాన్ని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పులి మోహన్ శనివారం ప్రారంభించారు.

కళాకారుల ప్రదర్శన

ముత్తారం: మండలంలోని మైదంబండలో శనివారం తెలంగాణ సాంస్కృతి కళాకారుల బృందం వ్యవసాయ కూలీలకు తమపాటల రూపంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామ పరిధిలోని రాజాపూర్‌లో రూ.5లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీరోడ్డు పనులను శనివారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు ప్రారంభించారు. మాజీ సర్పంచ్‌లు ఆకుల గట్టయ్య, అడ్వాల చంద్రయ్య, నాయకులు రాసకొండ రవి, చంద్రమౌళి, రాజయ్య, ఓదెలు, గసిగంటి అజయ్ పాల్గొన్నారు.

పోతారంలో..

ముత్తారం: మండలంలోని పోతారంలో ఇటీవల ఉపాధిహామీ నిధుల కింద సీసీరోడ్డు నిర్మాణానికి రూ.15.50లక్షలు మంజూరు కాగా పనులను శనివారం మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, నాయకులు చెలుకల జితేందర్, నర్ర మల్లయ్య, కిరణ్, బండ సమ్మయ్య, నెత్తెట్ల భారతలక్ష్మి, కొమురయ్య, ఓదెలు, శ్రీశైలం, కాంతయ్య, రాజయ్య పాల్గొన్నారు.

మంథనిలో బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

మంథని: ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం మంథని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేశారు. మంథని ఎస్సై వెంకటకృష్ణ ధర్నాను విరమింపజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌గౌడ్, బహుజనసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌లాల్ ఉన్నారు.

కవిత అరెస్టును నిరసిస్తూ రాస్తారోకో

ధర్మారం: ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ ధర్మారం మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని రాస్తారోకోను విరమింపజేశారు.

మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వొద్దు

సుల్తానాబాద్: పదో తరగతి విద్యార్థులకు మాల్ ప్రాక్టీస్‌కు అవకాశాలు ఇవ్వొద్దని, పదో తరగతి పరీక్షల సీఎస్‌లు రత్నాకర్‌రెడ్డి, రామస్వామి సూచించారు. శనివారం సుల్తానాబాద్ బాలుర హైస్కూల్లో ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈనెల 18 నుంచి నిర్వహిస్తున్న పరీక్షలకు పకడ్బందీగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు.

చలివేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ శివారులో ఆది, సోమవారాల్లో నిర్వహించే గోపు కొమురన్న జాతరలో భాగంగా శనివారం రాత్రి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా జాతర ప్రాంగణానికి చేర్చారు. ఊరేగింపులో జాతర నిర్వాహక కార్యదర్శి గోపు ఐలయ్యయాదవ్‌తో పాటు గోపు వంశీయులు, అధిక సంఖ్యలో యాదవులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత





నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం సూర్యనారాయణ, జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్‌–1లో శనివారం కార్మికుల పిల్లలకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా దిగిపోయిన కార్మికుల పిల్లలు 15మందికి నియామక పత్రాలు అందించారు. ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్‌–2 ఏరియాలో కారుణ్య నియామక పత్రాలను శనివారం అందజేశారు. జీఎం కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా దిగిపోయిన 10మంది మాజీ ఉద్యోగుల వారసులకు జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రెటరీ జీగురు రవీందర్, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్ ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, పర్సనల్ మేనేజర్ అనిల్‌కుమార్, సెక్యూరిటీ అధికారి షరీఫ్, డీవైపీఎం వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్

గోదావరిఖని: రోడ్ల విస్తరణలో యాజమాన్యం ఏకపక్షంగా వ్యవహరిస్తే ఊరుకోమని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ హెచ్చరించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈప్రాంత అభివృద్ధికి రోడ్డు వెడల్పు ప్రక్రియ మంచిదే అయినా, రోడ్డు మధ్యలో నుంచి ఇరువైపులా సమానంగా విస్తరణ చేపట్టాలన్నారు. ఈవిషయంలో కొంత అధికారులు లోపాయికారిగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఒకవైపే క్వార్టర్లు ఖాళీ చేయాలని యాజమాన్యం కార్మికులపై దాడి చేస్తోందన్నారు. ఈవిషయాన్ని అవసరమైతే సీఎం దృష్టికి తీసుకవెళ్తామన్నారు. క్వార్టర్ల విషయంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నోరు మెదపడటం లేదని, సొంత ప్రయోజనాలకు కక్కుర్తి పడుతున్నారన్నారు. రోడ్ల విస్తరణలో యాజమాన్యం పారదర్శకంగా వ్యవహరించకపోతే సంస్థకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తామన్నారు. నాయకులు జక్కుల నారాయణ, తోట వేణు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

జ్యోతినగర్: దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ప్రారంభం కావడంతో రామగుండం కార్పొరేషన్ పరిధిలో పలు రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపు చర్యలు చేపట్టారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో ఉన్న ఫ్లెక్సీల తొలగింపును రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ పరిశీలించి ఎన్నికల కోడ్‌లో ఎలాంటి రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని సూచించారు. ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బందితో తొలగించారు.

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ శనివారం ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో తక్షణమే కోడ్ అమల్లోకి వచ్చింది. అప్రమత్తంగా ఉన్న మున్సిపల్ అధికారులు కూడళ్లలో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించి ప్రత్యేక వాహనంలో తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలో అమ్మకు వందనం



తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని తల్లిదండ్రులతో చర్చించారు. అనంతరం అమ్మకు వందనంలో విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతి అందజేశారు. హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, తన్వీర్ సుల్తానా, మల్లయ్య, రవీందర్, సతీశ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు చైతన్య కేంద్రాలు



గ్రంథాలయం ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కాల్వశ్రీరాంపూర్: గ్రంథాలయాలు చైతన్య కేంద్రాలని ఎంపీపీ నూనేటి సంపత్ అన్నారు. మండలంలోని పెగడపల్లిలో శనివారం గ్రంథాలయం కేంద్రాన్ని జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఎంపీడీవో రామ్మోహనాచారితో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఎంపీవో గోవర్ధన్, ఎంపీటీసీ నిర్మల, వెన్నంపల్లి ఎంపీటీసీ జట్టి దేవేందర్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో ఉన్న గ్రంథాలయాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ శనివారం ప్రారంభించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలో నిర్మించిన మినీ గ్రంథాలయాన్ని అధికారులు, నాయకులతో కలిసి రామగిరి ఎంపీవో సమ్మిరెడ్డి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ లావణ్య గ్రామంలో సీసీరోడ్డు పనులను ప్రాంభించారు. గ్రామ ప్రత్యేక ఆఫీసర్ ఎం.సమ్మిరెడ్డి, కార్యదర్శి పర్శరాం, కళారాణి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని పన్నూర్ గ్రామంలో గ్రంథాలయాన్ని ఎంపీపీ ఆరెల్లి దేవక్క ప్రారంభించారు. జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీటీసీ చిందం మహేశ్, కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు

రామగిరి: మండలంలోని కల్వచర్లలో శ్మశానవాటికలో పలు అభివృద్ధి పనులను శనివారం రేండ్ల శారద కుమార్‌స్వామి దంపతులు ప్రారంభించారు. తన తండ్రి రేండ్ల వెంకటయ్య జ్ఞాపకార్థం కుమార్‌స్వామి దంపతులు గ్రామంలోని శ్మశానవాటికలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. సింగిల్‌విండో డైరెక్టర్ సైండ్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రేండ్ల అశోక్, మాజీ వార్డుసభ్యులు బూస బాపన్న, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు రేండ్ల కొమురయ్య, మున్నూరుకాపు సంఘం యూత్ అధ్యక్షుడు రేండ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞానశాస్త్రాన్ని పెంపొందించుకోవాలి

సుల్తానాబాద్: విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాన్ని పెంపొందించుకోవాలని ఇన్‌చార్జి ఎంఈవో సురేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని కేరళ మోడల్ హైస్కూల్లో నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థుల ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ సిజ్జూ ఎస్.నాయర్, వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్.నాయర్, సీఆర్పీ సదానందం తదితరులు పాల్గొన్నారు.